812) సాళంగనాట

ప॥ పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు। పరగి నానా విద్యల బలవంతుడు॥

చ॥ రక్కసుల పాలికి రణరంగ శూరుడు। వెక్కసపు ఏకాంగ వీరుడు।
దిక్కులకు సంజీవి తెచ్చిన ధీరుడు। అక్కజమైనట్టి ఆకారుడు॥

చ॥ లలిమీరిన యట్టి లావుల భీముడు। బలు కపికుల సార్వభౌముడు।
నెలకొన్న లంకా నిర్ధూమధాముడు। తలంపున రాము నాత్మారాముడు॥

చ॥ దేవకార్యముల దిక్కు వరేణ్యుడు। భావింపగల తపః ఫల పుణ్యుడు।
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు। సావధానుడు సర్వశరణ్యుడు॥